# ఆద్యంతములు

(మార్చి 1949)

ఆంగిరశ్శీలి మహర్షి. అనగా పెద్ద ద్రష్ట. మహర్షి యనుటతోడనే తపస్వి యనిగాని, మౌని యని గాని యనుకొనరాదు. శమదమాదిగుణములకు, దైవబుద్ధికి సంబంధము లేకుండ కొందరు ఋషులుందరు. వట్టి ద్రష్ట యను నర్థము లోననే యర్థము చేసికొనవలయును.

అతడగ్నియందు గొప్ప పరిశోధన చేసెను. సామూహికముగా జరిగిన మహాపరిజ్ఞానములో తత్కర్తృకము మిక్కిలి బాగుగ నున్నది. తొలుత నంగిరసుడు త్రిలోకంబులకు నగ్నియై వెలుగుచుండెను. అతడు ప్రథమవహ్ని. అసలు వేఱే యగ్ని యున్నాడు. కొన్ని దినములు పోయిన తర్వాత నంగిరు డగ్ని దేవునకు పుత్రుడుగా నంగీకరింపబడెను. ఈ యంగిరోగ్ని నుండి పదునాలు గగ్నులు సముద్భవించెను. అందు ఏడు పుమాకారములు. మరియేడు కాంతాకారములుగా వర్ణింపబడెను. ఈ యష్టాదశవహ్నులకు స్వరూప స్వభావ ప్రయోజనములు వివరించుటతో నాంగిరశ్శీలి మహర్షియయ్యెను.

ప్రథమాగ్ని వహ్నిరూపుడు. అంగిరసుడు ప్రాజాపత్యవహ్ని. అందుచేత నాంగిరశ్శీలి చేసిన పరిశోధనయంతయు యజ్ఞ సంబంధమైనది. కాని యతని మనస్సు యజ్ఞ విముఖమైనది.

ఇది గాక బృహస్పతి చేత చేయబడిన యగ్నిజ్ఞానము వేఱే కలదు. తదనుయాయులు కలరు, వారందరు ఋషులే, కాని వారి ఋషిత్వము వేఱు. వారి మతము వేఱుగా నుండెను. వారి మతము బృహస్పతి మతమయ్యెను.

'తపుడు' అను నొక మహావహ్ని కలదు. ఆ వహ్నినుండి పదునేను వహ్నులు సముద్భవించెను. ఈ వహ్నులన్నియు యజ్ఞ విరోధులు.

అంగిరశ్శీలి బృహస్పతి మతానుయాయులతో కలసి యా పదునేనువహ్నులలో పరిశోధన ప్రారంభించెను. ఈ వహ్నులన్నియు యజ్ఞ వినాశకములుగా నుండెను. శతఘ్నులకు, శత్రుసంహారమునకు, మహానగర నాశనమునకు నీవహ్ని లుపయోగింపబడి నట్లుండెను.

ఈ వహ్నుల యొక్క విజృంభణము చూచిన కొలది నాంగిరశ్శైలికి తల తిరిగిపోయెను. సర్వజగత్ప్రళయ హేతువుగా నున్న యీ యగ్నులు గాక వేఱే శివుడని యెవడున్నాడనిపించెను. యాజ్ఞికములైన మహావహ్నులు కలవు. వానికంటె స్థితి హేతువులు విష్ణ్వాదు లెవరనిపించెను.

వేలయేండ్లు జరిగిన తర్వాత అంగిరశ్శైలి నాస్తికుడను ప్రథపొందెను. అతడగ్నిలో చేసిన పరిశోధన వలన వాని శరీరము దేదీప్యమానముగా నుండెను. అతడే యొక వహ్నియా యనునట్లుండెను. ఈ వహ్నికి ఆరిపోవుట లేదు. అనింధనమైన వహ్నికి రూపముండునా? అతని యొక్క మనస్సముద్గతమైన యీ యనంతాగ్నేయ పరిశోధనాస్వరూప మహావహ్నికి వాని శరీర మింధన ప్రాయముగా నుండెను.

అతనికి యజ్ఞము లేదు. యాగము లేదు. శమదమాదులు లేవు. పరమేశ్వరుడు లేడు. సర్వమగ్నిమయముగా కనుపించెను.

అతని ప్రచారము వివర్ధమానమైన సప్తలోకము లావరించెను. త్రిమూర్తులు నుప్పరం బెగసిరి. ఐమూలల చొచ్చిరి. వారి యస్తిత్వము సంశయగ్రస్తమయ్యెను.

అంగిరశ్శైలియే సర్వసృష్టి హేతువుగా, నతని సిద్ధాంతమే పరమసత్యముగా గోచరించెను.

ఇంత నిత్యుడైన యాతడు తాను చనిపోయిన తర్వాత తన సిద్ధాంతమెవరు ప్రచారము చేయుదురని భయపడెను. ఈ యేమియు లేని దానికి తన సిద్ధాంతమెందుకు? దాని ప్రచార మెందుకు? తన నిత్యత్వమునందు సందేహమెందుకు? ఇన్ని వహ్నులను పరిశోధించినవాడీ బహిఃపరిశోధనలు పరిత్యజించి యీ సందేహమేమి యన్న విషయమును గూర్చి యంతఃపరిశీలన మొక్కసారియు చేయలేదు.

**(2)**

అతనికి జరలేదు. శారీరకముగా మృత్యువు లేదు. నిత్య వహ్నులచేత పరిపోషింపబడెను. అతని శరీరగత మాంసాస్థులు నిత్యప్రాణవహ్ని పరివర్ధితము

లయ్యెను. అతని యసృక్ప్రవాహమున శైత్యము యొక్క స్పర్శము గూడ లేకుండెను. వహ్నిప్రవాహము నిత్యము గాన చైతన్యభరితమైన యతని సృష్టిలో కదలిక లేకపోవుట యెట్లు? కదలిక మానినప్పుడు గదా చైతన్యమాగిపోవుట? మృత్యువు ప్రవేశించుట?

చలనము నిత్యమైనదా? చలనరాహిత్యము నిత్యమైనదా? చలనము - భావము చలన రాహిత్య మభావము. అభావము భావము గాదు. అందుచే మృత్యువు కల్పితము గాని యథార్థము గాదు.

అసలు వహ్నియనిననే నిత్య చైతన్య మని యర్థము. నిత్య చాలనము చేత వహ్ని సముద్భవించి తరంగములతోడి యణువుల యెడతెగని కదలిక తోడి ప్రవాహమైనదియే వహ్ని. ఈ 'యణువులు' యత్సబంధులు అన్న ప్రశ్న పుట్టినచో "తత్సబంధు" లనియే సమాధానము. ఆ తిరుగుటలోననే యణువులు భాసించెను. ఈ యణువులే తిరుగుచుండెను. ఆ యణువులకీ పరిభ్రమణమునకు నవినాభావసంబంధము. కనుక వహ్ని నిత్యము కాదనుట యెట్లు? వివరణ దశయందు, అనగా వ్యవహారదశయందు వానికి భేదము ప్రతీయమాన మగుచున్నది గాని మూలభూతమైన స్థితియందు భేదము లేదు.

సరే, యీ శరీరము మూలభూతమైన దశాసంబంధియా? వివరణ దశాసంబంధియా? మూలభూతమైన విషయమునందు వాగ్విషయము కూడ నుపరతి పొందుచున్నది. అట్లే శరీరము గూడ పొందవలయును.

మఱల నణువులు జడములా, సచేతనములా యన్న ప్రశ్న పుట్టినచో మఱికొంత తర్కము పుట్టును. అంగిరశ్శీలి యాతర్కము వంక పోడు. చేతనతా కారణము నూహింపడు. కనుక శివుడు లేడు. విష్ణువు లేడు.

**(3)**

అతనికి వేనవేలు శిష్యులు కలరు. ఋజస్కరుడు, క్రోధుడు, రసుడు, సుభీముడు, అతిభీముడు, సురహంత మొదలైనవారనేకులు. వారి నామములన్నియు నతని చేత కల్పింపబడిన వహ్నుల యొక్క నామములే.

వీరిలో సురహంత యాంగిరశ్శీలికి ప్రియతముడు. అతని ప్రాణమంతయు సురహంత మీదనేయుండును.

సురహంత గురువు కంటె పదియాకులెక్కువ చదివినవాడు.

చైతన్యమే ప్రాణము అని యేల కావలయును? నిశ్చైతన్యము ప్రాణమేల కారాదు? అగ్ని యనగా ప్రవాహభూతమైనది యేల కావలయును? నిశ్చలమైన వహ్నియేల యుండరాదు? అని యతడు పరిశోధన ప్రారంభించెను. అతని పరిశోధన పోదగినంత దవ్వుపోయెను. ఆ స్థితిలో కొంతకాలమతడు నిశ్చైతన్యుడుగా నుండెను. తదనంతరమున మఱల చైతన్యము ప్రాప్తించెను. ఆ నిశ్చైతన్య మనుభూత మయ్యెనా? అన్నది ప్రశ్న.

ఇట్లనేక పర్యాయములా నిశ్చైతన్యతను తాను పొందెను. అప్పుడు ప్రాణముండుట చేతనే తరువాత చైతన్యము మఱల కలిగినట్లు కాన్పించెను. కనుక నప్పుడు చైతన్యమున్నట్లే యను సిద్ధాంతమును నిర్మించెను.

ఇట్టి స్థితిలో నొక నిశ్చైతన్యపు వేళలో నతని కొక యనుభూతి కలిగెను. ఆ యనుభూతి తత్కాలమునందెట్టి దైనను స్మృతితోడి చైతన్యము కలిగినప్పుడు దానిని గుఱించి భావించినపుడు చిత్రముగా నుండెను. ఒక యెదో తరంగము రూపుకట్టినట్లుండెను. ఆ తరంగమొకప్పుడు త్రిశూలి. యొకప్పుడు సఫాలనేత్ర. యొకప్పుడు కపాలధారి, మరియొకప్పుడు చర్మాంబరము.

ఈ యాకృతి విశేషములు పలుసార్లతని నిశ్చైతన్యస్థితిలో భాసింప నారంభించెను. చైతన్య విరమణకు వీనికి నేమి సంబంధము? విరమించినప్పటి చైతన్యము యొక్క స్థితి యిదియా? చైతన్యము యొక్క క్రియారూపము లోకముగా భాసించి దాని నిష్క్రియా రూపమిట్లు భాసించునా?

ఇది యాకృతిరూపము. ఇది క్రియ. ఈ రెంటికి సంబంధము లేదా? అసలది నిజముగా నిశ్చైతన్యమైన స్థితియా? ఈ శరీరమునకు చైతన్యము లేకపోవుట గాని; అసలు చైతన్యము లేకపోవుట యెట్లు జరుగును? ఈ శరీరమునకు చైతన్యము లేని స్థితి స్వప్నమో, నిద్రయో, స్మృతిరహితత్వమో కావచ్చును.

ఇట్టి స్థితి మఱియు దీర్ఘమైనచో నది మృతియేల కారాదు?

చైతన్యము యొక్క యీ క్రియాదశ యవసానస్థితి నెప్పుడు పొందును? ఎట్లు పొందును?

ఆ యణుపరిభ్రమణలో కలిగిన కపాలి మొదలైన యాకారము లసలు చైతన్యము నెట్లు పరిపాలించుచున్నవి? స్వీకృత తదాకారమైన యా ప్రాణతరంగములకు భిన్నమైన శక్తి కలదా? భిన్నాకారములకు – సచైతన్యములకు భిన్న శక్తులున్నవి. అగుచో నాంగిరశ్శీలుని శక్తి భిన్నము. తన శక్తి భిన్నము.

అట్లే కపాలి, శూలియైన విశిష్టాకృతిమంతుని యొక్క శక్తి వేఱు.

సురహంత పోయిన కొలది భగవద్భక్తుడయ్యెను. ఆస్తికుడయ్యెను.

తనకు ప్రియతముడైన శిష్యుడు సురహంత యిట్లగుటకు నాంగిరశ్శీలి మిక్కిలి నొచ్చుకొనెను. వానిని గుఱించి భావించిన కొలది యతని శరీరములోని యుష్ణప్రవాహములు మందగమనము లగుచుండెను. అతడు నిత్యము తన శరీరములోని ప్రాణాగ్నులను ప్రసరింప చేయుచుండెను. కాని తన శిష్యుడిట్లయినా డన్న దిగులుచేత నా చైతన్య ప్రవాహములయందు యగ్నిత్వము తక్కువగుచుండెను. ఈ యూహలకు నాప్రాణాగ్నికి నేమి సంబంధము?

తన సిద్ధాంతములకు తన ప్రాణాగ్నికి నేమి సంబంధము?

సురహంతను బిలిచి పలుసార్లు చీవాట్లు పెట్టెను. తొలుత తొలుత కొంకినను చివర చివర కతడు గురువుతో తీవ్రముగానే వాదించెను.

సురహంత యిట్లనెను. "మన ప్రాణమును నిలుపునది నిజముగా నీ యగ్ని కాదు. ఎందుచేతననగా, నీ యగ్ని మన యూహలచేత పరిపోషింప బడుచున్నది. ఆ యూహలు పరమేశ్వరుని చేత పరిపోషింపబడుచున్నవి. నాయందు మీకు ప్రేమయున్నది. ఆ ప్రేమ విఘటితమై దుఃఖము కలుగుచున్నది. ఆ దుఃఖము మీ ప్రాణాగ్నిని శీతలింపచేయుచున్నది.

ఈ లెక్క ప్రకార మగ్ని కంటె నూహలకంటె సుఖదుఃఖములు ప్రాణధారక మారకములు కావలసివచ్చుచున్నది.

"ఈ సుఖదుఃఖములు భావములు, ద్రవ్యములు కావు. కల్పితములు. కల్పితమైన దానికి శక్తి లేదు. ఈ కల్పన చేసినదెవరు? అగ్ని సుఖ దుఃఖములను కల్పించదు. సిద్ధాంతము సుఖదుఃఖములను కల్పించదు. ఇవి సుఖదుఃఖములుగా పరిణమించును గాని వీని కల్పనకు హేతువులు గావు."

గురుశిష్యులు మిక్కిలి వివాదపడిరి. అన్నిటికంటె మర్యాదలేనిది యా వివాదమొక సభలో జరిగెను.

**(3)**

అంగిరశ్శీలికి పదిదినములు తాను పరిశోధన చేసి కల్పించిన వహ్నులకంటె భిన్నమైన యొక వహ్ని తన శరీరమందుద్భవించెను. అతడు మహర్షి కావున నా వహ్నిని తన శరీరము నుండి బహిర్గమింప చేసి దానిని పరిశీలించెను. దానిలో ప్రాణేతరములైన శక్తులు విజృంభించుచుండెను.

అంగిరశ్శీలికి భయము వేసెను. దాని కొక నామకరణము చేసెను. ఆ యగ్నిని జ్వరాగ్నియనెను.

ఈ జ్వరాగ్ని చిత్రమైనది. అది ప్రాణాగ్నికి విరోధియైనది. దేహమునకు నిస్సత్వకారియైనది.

అంగిరశ్శీలి పదిదినములు మంచమును వదలిపెట్టలేదు. అతనికి తన ప్రియతమ శిష్యుడైన సురహంత తన సిద్ధాంతమునకు వ్యతిరేకి యైనాడనియు, సభలో తన కంతటి పరాభవమైన దనియు దిగులు పుట్టెను. అంగిరశ్శీలికి భార్యాపుత్రులు లేరు. తనది యన్నది దమ్మిడీ లేదు. తానును, తన యగ్నులును, తాను నిత్యుడు. అగ్నికి చల్లారుట లేదు. తనకు మృత్యువు లేదు.

ఈ శిష్యప్రేమ యీ సిద్ధాంతాభిమానము మృత్యువుగా భాసించెను.

లోకములో  నెందరెన్ని విధములుగా మరణించుటలేదు! మరణము లేకుండా తాను పరిశోధించి కనుగొన్న యగ్నులచేత తాను నిత్యుడే! భగవంతుడే లేడే!  వాడు తనకు మృత్యువు నెట్లు తెచ్చును? ఆ భగవంతుడితని కెట్టి విచిత్రమైన మృతి తెచ్చుచుండెను?

అంగిరశ్శీలికి స్మృతి లేదు. అతనికి సంధి పుట్టెను. "సురహంతా! సురహంతా! యెంత చేసితివిరా? యెంత చేసితివి?" అని సంధిలో గొణిగి గొణిగి చివఱకా మాటలు తన నాలుకపై నాడుచుండగా మరణించెను.

ఈ యాద్యంత సహితుడైన వాడా యాద్యంత రహితమైన దాని నేల విశ్వసింపరాదు? అగ్నివంశమును నిర్మించిన యాంగిరశ్శీలి మరణించెను. ఆ మరణమునైనను దైవమన్నాడు గాడు.